ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★

ఆదివారం 7 జనవరి 2024

కార్మిక వాడల అభివృద్ధిపై దృష్టి పెట్టండి
- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్
8లో..

కొత్త గనులు, బ్లాకులపై దృష్టి
- సమీక్షలో సీఎండీ బలరాం
8లో..



అవనిపై విరిసిన హరివిల్లు

పెద్దపల్లి మార్కెట్ యార్డు ఆవరణలో ముగ్గులు వేస్తున్న మహిళలు, యువతులు

- ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీకి విశేష స్పందన
- జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 108 మంది మహిళలు, విద్యార్థినులు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 6: "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగుళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్గసీమ సుకేతన" స్థానిక పార్ట్‌నర్ మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల, పెద్దపల్లి సహకారంతో నిర్వహించిన పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించిన ఈ పోటీలకు పెద్దపల్లి, గోదావరిఖని, బసంత్‌నగర్, ఖైటింక్లయిన్ కాలనీ, ఎలిగేడు, కాల్వ శ్రీరాం పూర్, జూలపల్లి, సుల్తానాబాద్ తదితర ప్రాంతాల నుంచి 108 మంది మహిళలు, విద్యార్థినులు హాజరై ఉత్సాహంగా ముగ్గులు వేశారు. ఆకాశంలో పరుచుకునే హరివిల్లు అవనిపై విరిసినట్లుగా.. సంక్రాంతి పండుగ నేపథ్యం.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతి బింబించే విధంగా, ఆడపిల్లలపై జరుగుతున్న అఘాయిత్యాలు, భ్రూణహత్యలను నివారించాలనే సందేశాలతో మహిళలు వేసిన ముగ్గులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

● పోటీలు నిర్వహించడం అభినందనీయం..
- ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

ఒకప్పుడు సంక్రాంతి పండుగ వచ్చిందంటే గ్రామాల్లో చాలా మంది ముగ్గులు వేసేవారని, ఆ తర్వాత పట్టణాల్లో వేయడం ఆరంభమైందని, ఈతరం అమ్మాయిలకు ము గ్గుల యొక్క ప్రాశస్త్యం గురించి వివరించేందుకు ఆంధ్రజ్యోతి ఏబీఎన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఇక్కడ వేసిన ముగ్గులు పండుగ నేపథ్యాన్ని వివరించడమే గాకుండా సామాజికంగా బాలికలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను రూపుమాపే విధంగా మహి ళలు ముగ్గులు వేశారన్నారు. ఈ ముగ్గులు సమాజాన్ని ఆలోచింపజేస్తాయన్నారు. మహిళలే గాకుండా యువ తులు, విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనడం వల్ల సంస్కృతి, సంప్రదాయాలను మరచిపోకుండా చేస్తున్నాయని అన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఇక్కడకు వచ్చి ఎంతో ఓపికతో రెండు గంటల పాటు ముగ్గులు వేయడం సంక్రాంతి పండుగ ఉట్టిపడేలా చేసిందన్నారు.

● చుక్కల ముగ్గులు సంప్రదాయాలకు నిదర్శనం..
- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్

చుక్కల ముగ్గులు చక్కటి సంప్రదాయాలకు నిదర్శనమని, ఇందుకు ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఇరవై ఏళ్లుగా ముగ్గుల పోటీలను నిర్వహించడం అభినందనీయమని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్ అన్నారు. ఇక్క డికి రాకముందు కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్నానని, ఇక్కడికి వచ్చిన తర్వాత కూడా ఆ అవకాశం రావడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఇక్కడ వేసిన ముగ్గుల్లో చాలా మంది చుక్కల ముగ్గులు వేశారని, అందులో ఈ తరం విద్యార్థినులు కూడా చుక్కల ముగ్గులు వేయడం మంచి పరిణామమని అన్నారు. బహుమతి కోసమని గాకుండా జిల్లా నలుమూలల నుంచి తమ సృజనాత్మకతను చాటుకునేందుకు పోటీకి వచ్చిన వారందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ జడల సురేందర్ మాట్లాడుతూ తమ యార్డు ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించడం వల్ల ఒక కొత్త కళ వచ్చిందని, ప్రతి ఏటా ఇక్కడే నిర్వహించాలని తాము సహాయ సహ కారాలు అందిస్తామన్నారు. మదర్ థెరిస్సా డైరెక్టర్ అడవెల్లి నవత మాట్లాడుతూ పండుగ సాంప్రదా యాలను ప్రతిబింబించేలా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎల్లవేళలా ఈ పోటీల నిర్వహణకు తమ సహాయసహకారాలు అందిస్తామని అన్నారు.

● మొదటి బహుమతి గెలుచుకున్న సాయిశ్రద్ధ

ఈ పోటీల్లో గోదావరిఖనికి చెందిన సాయిశ్రద్ధ మొదటి బహుమతిని గెలుచుకోగా, రెండవ బహుమతి పెద్దపల్లికి చెందిన సీపెల్లి ఇందు, మూడవ బహుమతి గోదావరిఖనికి చెందిన దుర్గం రేణుకకు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, జిల్లా అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్, మదర్ థెరిస్సా ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ అడవల్లి నవీన్ నగదు బహుమతులను అందజేశారు. అలాగే మరో 20 మందికి కన్సోలేషన్ బహుమతులు, పోటీల్లో పాల్గొన్న వారందరికీ చిరు కానుకలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ నవత, పెద్దపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ జడల సురేందర్, మార్కెట్ కమిటీ ప్రథమ శ్రేణి కార్యదర్శి ప్రథ్వీరాజ్ దేవరాజు, న్యాయనిర్ణేతలు అధ్యాపకురాలు డి అంబిక, అమర్‌నగర్ యూపీఎస్ ప్రధానోపాధ్యాయురాలు కె మంజులత, ఉపాధ్యాయురాలు డి సంధ్యారాణి, ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ బుర్ర సంపత్ కుమార్ గౌడ్, ఏబీఎన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ నందెవేన శ్రీనివాస్ ఆంధ్రజ్యోతి రిపోర్టర్లు చింతకింద చంద్రమొగిలి, బుర్ర తిరుపతి, మల్యాల శివాచారి, కన్నం చంద్రమౌళి, రామిడి మృత్యుంజయం, ఫొటోజర్నలిస్టు ఎండీ షకూర్, ఏబీఎన్ వీడియో జర్నలిస్టు దాడి సంపత్ తదితరులు పాల్గొన్నారు.



ప్రథమ బహుమతి గెలుచుకున్న సాయిశ్రద్ధకు గిఫ్ట్‌తో పాటు మెమెంటో అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు



ప్రథమ బహుమతి విజేత సాయిశ్రద్ధ వేసిన ముగ్గు



ద్వితీయ బహుమతి విజేత ఇందు వేసిన ముగ్గు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు



ముగ్గులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు, అదనపు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌లాల్



మాట్లాడుతున్న పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



తృతీయ బహుమతి విజేత దుర్గం రేణుక వేసిన ముగ్గు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి
- 'ఖని' అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్‌రావు



'ఖని'లో మాట్లాడుతున్న జిల్లా అదనపు న్యాయమూర్తి శ్రీనివాస్‌రావు



హన్మంతునిపేటలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అర్జున్

కోల్‌సిటీటౌన్, జనవరి 6: పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో సైబర నేరాలు సైతం అదేవిధంగా పెరిగిపోయాయని వాటిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గోదావరిఖని సప్తగిరికాలనీలోని కృష్ణవేణి వికాస్ జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. స్మార్ట్‌ఫోన్‌ల వాడకం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. దీంతో సైబర్ నేరగాళ్లు తప్పుడు లింక్‌లు పంపి డబ్బులను మనకు తెలియకుండానే కాజేస్తారన్నారు. అంతేకాక సోషల్‌మీడియాలో పెట్టే ఫోటోలను మార్ఫింగ్ చేసి కొంతమంది అకతాయిలు బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారన్నారు. అందుకే స్మార్ట్‌ఫోన్ వాడే వారంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే యువత మద్యానికి బానిసగా మారి విలువైన జవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటోందన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారన్నారు. యువత మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వెంకన్న, న్యాయవాదులు సీహెచ్ శైలజ, తౌటం సతీష్, సోషల్ వర్కర్ ఎం.శంకర్, మండల లీగల్ వాలంటీర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలి..

పెద్దపల్లి రూరల్, జనవరి 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ అన్నారు. శనివారం మండలంలోని జాతీయ న్యాయసేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు హన్మంతునిపేట గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ హాజరై గ్రామస్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత చెడు అలవాట్లకు బానిసలవుతున్నారని, యువత చెడుమార్గాల వైపు వెళ్లకుండా భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకోని మంచి ఉద్యోగం సాధించి జీవితంలో స్థిరపడే విధంగా ఆలోచించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని సూచించారు. ఏళ్లతరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించేందుకు న్యాయవాదుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. సామరస్యంగా కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ రెడ్డి శంకర్, శ్రీధర్, రమేష్, శ్రీనివాస్, శంకర్, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి సునిత, పెద్దపల్లి ఎస్ఐ-2 మల్లేష్, సింగిల్‌విండో డైరెక్టర్ మేకల కుమార్,సంపత్‌రావు, నరేష్, హనుమాన్‌సింగ్, సతీష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

విద్యార్థిని సన్మానించిన కలెక్టర్



విద్యార్థి ఆదిత్యతేజను అభినందిస్తున్న కలెక్టర్ ముజమిల్లాఖాన్

మంథని, జనవరి 6: ఎస్‌జీఎఫ్ఐ జాతీయ పోటీల్లో కరాటే 35కేజీల విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించిన మంథని జడ్పీహెచ్ఎస్ బాయ్స్ స్కూల్ 9వ తరగతి విద్యార్థి మంథనికి చెందిన బేర ఆదిత్య తేజను కలెక్టర్ ముజమిల్లాఖాన్ శనివారం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా సన్మానించారు. ఆదిత్యతేజ నల్గొండలో జరిగి ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్రస్థాయి పోటీల్లో కరాటే పోటీల్లో కరాటే 35 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించి తెలంగాణ రాష్ట్రం తరుపున గత డిసెంబరు నెలలో న్యూఢిల్లీ జరిగిన ఎఫ్‌జీఎఫ్ఐ నేషనల్ పోటీల్లో పాల్గొని బ్రాంజ్ మెడల్ సాధించారు. ఆదిత్యతేజకు సహకరించిన పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, పీఈటీ డాక్టర్ దొమ్మటి రవిలను సైతం కలెక్టర్ ముజ మిల్లాఖాన్ ప్రత్యేకంగా అభినందించారు. డీఈవో మాధవి,ఏఎంవో పీఎం షేక్, ఎంఈవో లక్ష్మి, ఎంఎన్‌వో హరిప్రసాద్‌లు పాల్గొన్నారు.

'ప్రజా పాలన'లో 2,31,341 దరఖాస్తులు
- 17 తేదీవరకు ఆన్‌లైన్‌లో నమోదు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలుచేసేందుకు నిర్వహించిన ప్రజాపాలన గ్రామ, వార్డు సభల ద్వారా వెల్లువలా దరఖాస్తులు వచ్చాయి. డిసెంబర్ 28 నుంచి ఈనెల6వ తేదీ వరకు 266 గ్రామపంచాయతీల్లో ఒక మున్సిపల్ కార్పొరేషన్, మూడు మున్సిపాలిటీల పరిధిలోని 114 డివిజన్లు, వార్డుల్లో, నిర్వహించిన గ్రామ, వార్డుసభలు నిర్వహించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, చేయూత గ్యారంటీ పథకాల అమలు కోసం దరఖాస్తులు స్వీకరించారు. గ్రామాల్లో 1,61,195,పట్టణాల్లో 70,146,మొత్తం 2,31,341 దరఖాస్తులు వచ్చాయి. గ్రామాల్లో 1,92,072, పట్టణాల్లో 77,389 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులన్నింటినీ ఈనెల 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు నెలకు 2,500 రూపాయలు వేస్తామని, 500 రూపాయలకే వంట గ్యాస్ ఇస్తామని ప్రకటించింది. ఆర్టీసీ బస్సుల్లో ఉచితప్రయాణం డిసెంబర్ 9వ తేదీ నుంచి అమల్లోకి తీసుకవచ్చిన విషయం తెలిసిందే. గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల వరకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తామని, రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం కింద ఎకరానికి రెండు పంటలకు కలిపి 15 వేలు, కౌలు రైతులకు 15వేలు, కూలీలకు 12వేలు ఇస్తామని ప్రకటించింది. ఇందిర మ్మ ఇళ్ల పథకం ద్వారా సొంత స్థలం ఉండి ఇల్లు నిర్మించుకునే వారికి 5లక్షలు, తెలంగాణ ఉద్యమకారులకు 250గజాలస్థలంతో పాటు ఇల్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. చేయూత కింద ఇప్పుడు ఇస్తున్న పింఛన్లను డబుల్ చేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు ప్రజల నుంచి గ్రామ, వార్డు సభల ద్వారా దరఖాస్తులను స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఈనెల 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. ఆ తర్వాత వాటిని పరిశీలించి ఆయా పథకాలకు అర్హులను గుర్తించనున్నారు.

ప్రత్యేక ఓటరు నమోదును సక్రమంగా నిర్వహించాలి

మంథని, జనవరి 6: మంథని నియోజకవర్గంలోని 10 మండలాల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంథని ఆర్డీవో హనుమా నాయక్ సూచించారు. శనివారం నియోజకవర్గంలోని తహసీలార్లు, బీఎల్‌వోల సూపర్‌వైజర్స్‌తో ఆర్డీవో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముసాయిదా ఓటరు జాబితాను పబ్లిష్ చేశామన్నారు. జాబితాను అన్ని తహసీల్దార్ల కార్యాలయాల్లో ఓటర్ల పరిశీలన కోసం అంటుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈనెల 6వ తేదీ నుంచి 22వరకు అర్హులైన ప్రతి ఒక్కరు నూతన ఓటరుగా నమోదు చేసుకోవటానికి సంబంధిత బీఎల్‌వోలు, తహసీల్దార్ల కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను అమలు చేస్తాం
- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జనవరి 6: కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 202మంది లబ్ధిదారులకు రూ.2.02కోట్ల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చినా ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని, మోసపూరిత మాటలతో ప్రజలను మోసం చేశారని, కాంగ్రెస్ పార్టీకి ప్రజలు భారీ మెజార్టీతో పట్టం కట్టారని చెప్పారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, మహాలక్ష్మి పథకం, ఆరోగ్యశ్రీ పథకం కింద నిరుపేదలకు రూ.10లక్షల ఆరోగ్య బీమా అందించడం జరిగిందని, మిగిలిన నాలుగు గ్యారంటీలను వంద రోజుల్లో ప్రభుత్వం తప్పకుండా అమలు చేస్తుందని చెప్పారు. ఆడపిల్లల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం క్రింద లక్ష రూపాయలతో పాటు తులం బంగారం అందజేయడం జరుగుతుందని చెప్పారు. రామగుండం ప్రజలు ఏ సమస్య వచ్చినా తనను నేరుగా సంప్రదించవచ్చునని, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని ఆయన చెప్పారు. ఈనెల 16 నుంచి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో రామగుండం తహసీల్దార్ కుమారస్వామి, కార్పొరేటర్లు మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, కొలిపాక సుజాత, పెద్దెల్లి తేజస్విని, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, పాతిపెల్లి ఎల్లయ్య, దీటి బాలరాజు, ఫజల్‌బేగ్, దశరథం, గట్ల రమేష్, మారెల్లి రాజిరెడ్డి, గుండేటి రాజేష్, తిప్పారపు శ్రీనివాస్, బయ్యపు మనోహర్‌రెడ్డి, తాళ్లపల్లి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ

పెద్దపల్లి రూరల్, జనవరి 6 : పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్ మండలం, పట్టణ కేంద్రానికి చెందిన 80 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా 80 మంది లబ్ధిదారులకు రూ.80లక్షల 34వేల 309 విలువగల చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, పెద్దపల్లి జడ్పీటీసీ బండారి రాంమ్మూర్తి, ఆర్ఐలు నవీన్‌రావు, సతీష్, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ భూములు కబ్జా చేస్తే ఊరుకోం

● ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ సంకశాల మల్లేష్



ఫార్మసీ కళాశాల భూములను పరిశీలిస్తున్న వీసీ, ఎస్‌యూ సిబ్బంది

గణేశ్‌నగర్, జనవరి 6: శాతవాహన యూనివర్సిటీ కళాశాల భూములను కబ్జా చేసే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని శాతవాహన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎస్. మల్లేష్ హెచ్చరించారు. రెండు రోజుల నుంచి శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల భూములను కళాశాల పక్కనే ఉన్న ప్రైవేట్ భూములతో పాటు ఎలాంటి అనుమతులు లేకుండా చదును చేసే ప్రయత్నం చేయగా వెంటనే దృష్టికి వచ్చిందన్నారు. వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని భూ కబ్జాకు పాల్పడిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని వాహనాలను సీజ్ చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. ఫార్మసీ కళాశాల భూములను ఇకపైన ఎవరూ కబ్జా చేయకుండా పూర్తి స్థాయి ఫెన్సింగ్ చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా భూములను కబ్జా చేసే ప్రయత్నం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు. వారిపై క్రిమినల్ కేసులు వేస్తామన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

● ఫార్మసీ కళాశాల ఎదుట ఏబీవీపీ ధర్నా

గణేశ్‌నగర్,జనవరి 6: ఎస్‌యూ భూమిపై కన్నేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శాతవాహన యూనివర్సిటీ ఎదుట శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ పుసాల విష్ణు మాట్లాడుతూ శాతవాహన విశ్వవిద్యాలయం ఎల్ఎండీ ఫార్మసీ కళాశాల భూమిని చదును చేసిన విషయంలో విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు రిజిస్ట్రార్ వరప్రసాద్, ఉపకులపతి మల్లేష్ లేదా డ్రాయింగ్ ఆఫీసర్ సైన్స్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ జయంతితో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల్సి ఉన్నా వారు ఒక కాంట్రాక్ట్ అధ్యాపకుడితో ఫిర్యాదు చేయించడం, బాధ్యుడిగా చేసే ప్రయత్నం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. గత ప్రభుత్వ అండదండలతో ఉపకులపతి, ఆయన అనుకూల వర్గం ఏం చేసినా పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ ప్రభుత్వం అయినా శాతవాహన విశ్వవిద్యాలయ అధికారుల అవినీతి, అక్రమాలపై విచారణ చేపట్టి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్య నిర్వహణ సమితి సభ్యుడు అంజన్న, నగర కార్యదర్శి నందు, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు మధు, లాఫోరం కన్వీనర్ ప్రమోద్, శ్రీ వర్ధన్, సాయి, రాజశేఖర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యోగుల సంఘం

ఉమ్మడి జిల్లా కో-ఆర్డినేటర్‌గా నాగేందర్‌సింగ్

కరీంనగర్ టౌన్, జనవరి 6: తెలంగాణ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కో-ఆర్డినేటర్‌గా సర్దార్ నాగేందర్‌సింగ్‌ను నియమించినట్లు ఉమ్మడి జిల్లా చైర్మన్ జక్కోజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ ఫయాజ్ అలీలు ప్రకటించారు. ఈ సందర్భంగా తన నియామకానికి సహకరించిన వారికి నాగేంద్‌సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, జనవరి 6 : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామంలో ఆనారోగ్యం కారణంతో ఒల్లెం మల్లు (78) అనే వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు శనివారం తెలిపారు. మల్లు గత కొన్ని రోజుల నుంచి కడుపునొప్పి, నరాల బలహీనతతో బాధపడుతూ పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. దీంతో వ్యాధి గురించి తరచుగా బాధపడుతుండేదని పోలీసులు, బంధువులు తెలిపారు. మల్లు శుక్రవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో తాను పడుకున్న మంచంతో పాటు దుప్పటికి నిప్పు అంటిచుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. మల్లు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు గమనించి కాపాడే ప్రయత్నం చేశారని తెలిపారు. గ్రామస్థుల సహకారంతో చికిత్స నిమిత్తం కోరుట్ల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మల్లు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మల్లు కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ తెలిపారు.

గుండెపోటుతో పొలంలోనే రైతు మృతి

శంకరపట్నం, జనవరి 6: మండలంలోని రాజాపూర్ గ్రామంలో శుక్రవారం గుండెపోటుతో రైతు పొలంలోనే మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాతంగి ఓదెలు (55) అనే రైతు పొలంలో పనిచేస్తుండగా గుండెపోటు రావడంతో పొలంలోనే కుప్పకూలిపోయాడు. ఓదెలు ఎంతసేపటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు వెతకగా పొలంలో పడిపోయి మృతి చెందినట్లు తెలిపారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కొడిమ్యాల, జనవరి 6: మండలంలోని తురుకకాశీనగర్ గ్రామ శివారులో శనివారం సాయంత్రం గంగాధరకు చెందిన పలువురు పేకాట రాయుళ్లను పట్టుకొని వారి వద్ద నుంచి 16వేల 300 రూపాయల నగదును పట్టుకున్నట్లు ఎస్సై కె. వెంకట్‌రావు తెలిపారు. 10 మోటార్‌సైకిళ్లు, 12 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. పేకాట ఆడుతున్న వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

వేములవాడ టౌన్, జనవరి 6: వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చడంతో అమాయకుల ప్రాణాలు పోతున్నాయని, వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి శనివారం ఒక ప్రకటన ద్వారా వేటగాళ్లను హెచ్చరించారు. కోనరావుపేట మండలం మర్రిమడ్ల, రుద్రంగి మండలం మానాల గ్రామాల్లో ఇటీవల వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ తీగలు అమర్చడంతో ఇద్దరు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. ఇద్దరు అమాయకులు మరణానికి కారణమైన వారిపై కేసు నమోదు చేసి పీడీ యాక్టు పెట్టి జైలుకు పంపించామని తెలిపారు. పంట పొలాలను కాపాడేందుకు రైతులు, వన్యప్రాణులను వేటాడేందుకు వేటగాళ్లు విద్యుత్ తీగలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు.

రామడుగు ఎంపీపీ అవిశ్వాసంపై హైకోర్టు స్టే

రామడుగు, జనవరి 6: రామడుగు మండల పరిషత్ అధ్యక్షురాలు కలిగేటి కవితపై ఈ నెల 17న ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్టే విధించింది. ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్ ఎంపీటీసీ జవ్వాజి హరీష్ ఆధ్వర్యంలో పదిమంది సభ్యులతో కలిసి గత నెల 19న ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. దీంతో ఆయన ఈ నెల 8న అవిశ్వాస తీర్మానానికి ప్రత్యేక సమావేశం నిర్వహించుటకు నోటీస్ జారీ చేశారు. అయితే ఎంపీపీ దీన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో రిట్ వేయడంతో 8న నిర్వహించనున్న అవిశ్వాస తీర్మానం ఆపాలని స్టే విధించింది. దీంతో అవిశ్వాస తీర్మానానికి బ్రేక్ పడింది. ఎంపీపీ, జడ్పీటీసీ, ఆర్డీవోకు హైకోర్టు స్టేను సమర్పించినట్లు విలేకరులతో ఎంపీపీ తెలిపారు.

పోక్సో బాధితులకు సహాయం అందించాలి

తిమ్మాపూర్, జనవరి6: పోక్సో బాధితులను గుర్తించి కావలసిన సహాయం అందించాలని మహాత్మానగర్ సర్పంచ్ జక్కని శ్రీవాణి తెలిపారు. శనివారం మండలంలోని మహాత్మానగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్గొని మాట్లాడారు. గ్రామంలో భిక్షాటన చేసే పిల్లలను గుర్తించాలన్నారు. బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. బాల కార్మికులు లేకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఆ దిశగా పాటు పడాలన్నారు. గ్రామల్లో బాల్య వివాహాలను నిరోధించడంలో గ్రామ పంచాయతీ పాలకులు ఆయా శాఖల అధికారులు కీలకపాత్ర పోషించాలన్నారు. ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దాలని చట్టబద్ధమైన దత్తతను గుర్తించి ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని కోరారు. పిల్లల హక్కులను కాపాడేలా అధికారులు గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీడిపివో ఆరవింద, సూపర్‌వైజర్ శ్రీలత, అంగన్వాడీ టీచర్లు కవిత, పద్మ, ఇతర ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్‌యూ డిగ్రీ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డీబార్

గణేశ్‌నగర్, జనవరి 6: శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో జరుగుతున్న డిగ్రీ ఒకటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో 12 మంది విద్యార్థులు డీబార్ అయినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎస్వీ శ్రీరంగప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో సెమిస్టర్‌లో ప్రభుత్వ డిగ్రీ అండ్ పీజీ కళాశాల హుజురాబాద్‌లో- 2, అల్ఫోర్స్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల కరీంనగర్‌లో-1, సెమిస్టర్-3లో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల హుజురాబాద్‌లో-1 అపూర్వ ఉమెన్స్ డిగ్రీ కళాశాల కరీంనగర్‌లో ఏడుగురు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల గోదావరిఖనిలో ఒకరు డీబార్ అయినట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఏడుగురికి జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, జనవరి 6: మోతాదుకు మించి మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన కేసుల్లో ఒకరికి పది రోజులు, మరొకరికి ఐదు రోజులు, మరో ఐదుగురికి మూడు రోజుల జైలుశిక్ష విధిస్తూ కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ట్రాఫిక్ ఏసీపీ మహ్మద్ సర్వర్ తెలిపారు. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డ 45మంది వాహనదారులను శనివారం కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి జైలుశిక్షతో పాటు 14,500 జరిమానా విధించారని తెలిపారు. మిగతా 38 మంది వాహనదారులకు 66 వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు.

ప్రజాపాలన కార్యక్రమానికి అద్భుత స్పందన

- నాలుగు నెలలకు ఒకసారి ప్రజాపాలన నిర్వహణ - ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన



లాలపల్లిలో మాట్లాడుతున్న శ్రీదేవసేన

ఎలిగేడు, జనవరి 6: కాంగ్రెస్ ప్రభుత్వ గ్యారంటీ పథకాలను అర్హులందరికీ అమలు చేసేందుకు ప్రజలనుంచి దరఖాస్తుల స్వీకరణ కోసం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి అద్భుత స్పందన వచ్చిందని ప్రజాపాలన ఉమ్మడి జిల్లా నోడల్ అధికారి శ్రీదేవసేన అన్నారు. శనివారం మండలంలోని లాలపల్లి, నారాయణపల్లి గ్రామాల్లో చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి విచ్చేసిన ప్రజాపాలన ఉమ్మడి జిల్లా కరీంనగర్ నోడల్ అధికారి శ్రీదేవసేనను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రజాపాలన కార్యక్రమానికి దరఖాస్తులు సమర్పించేందుకు వచ్చిన దరఖాస్తుదారులతో శ్రీదేవసేన ముచ్చటించారు. అనంతరం ఆమె లాలపల్లిలో మాట్లాడుతూ ప్రజాపాలన కార్యక్రమాన్ని పరిశీలించేందుకు పెద్దపల్లి జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. పెద్దపల్లి కలెక్టర్‌గా రెండున్నర సంవత్సరాల పాటు తాను పనిచేయడం తన కెరియర్‌లో ఒకమైలురాయిగా నిలిచిపోతుందన్నారు. గ్యారంటీ పథకాలపై మంచి అవగాహనతో ప్రజలు వారికి అవసరమైన పథకాలకు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. నాలుగునెలలకు ఒకసారి ప్రజాపాలన కార్యక్రమం చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదుచేసి, నిర్దిష్ట ప్రభుత్వ మార్గదర్శకాలు ప్రకారం అర్హులను ఎంపికచేసి పథకాలను అమలుచేస్తామని ఆమె పేర్కొన్నారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రజలకు పథకాలను అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగమే గ్రామాల్లో ప్రజల వద్దకు వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు. నూతన రేషన్‌కార్డుల కోసం సైతం ప్రజాపాలన కార్యక్రమంలో తెల్లకాగితంపై దరఖాస్తు సమర్పించాలని, రేషన్‌కార్డు దరఖాస్తులు, ఇతర దరఖాస్తుల సమర్పణ కోసం ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా ఉపాధి అధికారి వై తిరుపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, సింగిల్‌విండో ఛైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి, ఏపీఎం సుధాకర్, పంచాయతీ కార్యదర్శి ఎస్ శిరీష, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఏఐఏఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడిగా దమ్మన్నపేట విద్యార్థి



రామ్ విలాస్

గంభీరావుపేట, జనవరి 6: ఆల్ ఇండియా అగ్రికల్చరల్ స్టూడెంట్ అసోసియేషన్ (ఏఐఏఎస్‌ఏ) జాతీయ అధ్యక్షుడిగా గంభీరావుపేట మండలం దమ్మన్నపేటకు చెందిన రామ్ విలాస్ పాశ్వన్ ఎన్నికయ్యాడు. ఆల్ ఇండియా అగ్రికల్చర్ స్టూడెంట్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడిగా రామ్‌విలాస్‌ను ఇటీవల వెల్లడించిన పలితాల్లో ప్రకటించారు. దమ్మన్నపేటకు చెందిన విస్లావత్ లోక్యా నాయక్, సత్తవ్వ దంపతుల కుమారుడు రామ్‌విలాస్ పాశ్వన్. ఇతను ఐసీఏఆర్ భారత వ్యవసాయ పరిశోదన విద్యాయలంలో (న్యూఢిల్లీ)లో పరిశోధనలను కొనసాగిస్తున్నాడు. ఇటీవల నిర్వహించిన ఎన్నికలకు సంబంధించి అన్ని రాష్ట్రాల విద్యార్థుల నామినేషన్‌కి రిటర్నింగ్ అధికారులు దరఖాస్తులను ఆహ్వానించారు. దీనికి గాను అన్ని రాష్ట్రాల నుంచి 304 మంది నామినేషన్‌లు వేశారు. వారి యొక్క కార్యకలాపాలను, ఆలోచనలు పరిగణలోకి తీసుకుని నామినేషన్ రిటర్నింగ్ అధికారులు మంచి ప్రతిభ కనబర్చిన రాంవిలాస్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు. మారుమూల గ్రామానికి చెందిన గిరిజన బిడ్డ ఎంపిక కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

గంజాయి రవాణాదారులపై టాస్క్‌ఫోర్స్ స్పెషల్‌డ్రైవ్

- ఆరుగురి బైండోవర్

కోల్‌సిటీ, జనవరి 6: గంజాయి నిర్మూలించాలని ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం రామగుండం కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గోదావరిఖని వన్‌టౌన్, మంచిర్యాల, బెల్లంపల్లి వన్‌టౌన్, చెన్నూర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి వేల్పుల సాయిచందర్, ఎస్‌కే జమీర్, జాడి సాయిపవన్, ఎండీ అన్వర్, గుజ్జుల సాయితేజ, భీముల అంజిని బైండోవర్ చేశారు. బైండోవర్లనుఉల్లంఘిస్తే జైలుశిక్ష తప్పదని సీపీ హెచ్చరించారు.

'కాళేశ్వరం'లో లోపాలున్నాయని తెలిసినా చర్యలేవి?

- ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి



ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్, జనవరి 6: కాళేశ్వరం ప్రాజెక్టులో లోపాలు ఉన్నాయని నాలుగేళ్లుగా బీజేపీ నాయకులు చెబుతున్నారని, మరి ఎందుకు చర్యలు చేపట్టలేదని ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. రాయికల్ పట్టణంలోని 4వ వార్డులో నిర్వహిస్తున్న ప్రజాపాలన కార్యక్రమాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాస్తవాలను వెలికితీయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం న్యాయవిచారణకు ఆదేశిస్తే బీజేపీ నాయకులు సీబీఐ ఎంక్వైరీ కోరడం హాస్యాస్పదమన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను లొంగదీసుకోవడానికే బీజేపీ నాయకులు కాళేశ్వరం అవకతవకలపై సీబీఐ విచారణ కోరుతున్నారని జీవన్‌రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో నాణ్యత లోపించి బ్యారేజీ కుంగిపోవడం, కాళేశ్వరం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో సీడబ్ల్యూసీ అనుమతులు లేవని బీఆర్‌ఎస్‌వాళ్లే చెప్పారని అన్నారు. ప్రాజెక్ట్ అనుమతులు పరిశీలించి నిధులు ఇవ్వాల్సి ఉండగా, పూర్తి స్థాయిలో అనుమతులు లేని ప్రాజెక్టుకు నిధులు ఏ విధంగా సమకూర్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ పారదర్శకతతో వాస్తవాలను వెలికితీయాలనే భావనతో, న్యాయ విచారణకు ఆదేశిస్తున్న తరుణంలో బీజేపీ నాయకులు కాళేశ్వరంపై సీబీఐ విచారణ ఎందుకు చేపట్టడం లేదనడం ఆశ్చర్యం కలుగుతుందన్నారు. ప్రాణహిత తుమ్మిడిహెట్టి వద్ద మహారాష్ట్ర ప్రభుత్వంతో గతంలోనే ఒప్పందం కుదిరిందని, కేవలం రూ.10 వేల కోట్లతో తుమ్మిడిహెట్టి వద్ద నుంచి ప్రాణహిత ప్రవాహాన్ని మళ్లించి సుందిళ్లకు కలుపవచ్చని అన్నారు. ఒకే లిఫ్ట్ ద్వారా ఎల్లంపల్లికి నీరు ఎత్తిపోయవచ్చని, రెండు లిఫ్టల భారం తగ్గిపోతుందని అన్నారు. తక్షణమే తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టేందుకు వచ్చే మార్చి బడ్జెట్‌లో ప్రతిపాదించి, సంవత్సర కాలంలో నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నిబద్ధతతో కొనసాగే పార్టీ అని, జాతీయ స్థాయిలో అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ చట్టం, విద్యా హక్కు చట్టం, సమాచార హక్కు చట్టం, నిరుపేద వర్గాలకు ఇళ్ల నిర్మాణం అమలు చేస్తున్నామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాలను ఏ రాజకీయ పార్టీ కొత్తగా ఏ కార్యక్రమాలు చేపట్టలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

మెట్‌పల్లి, జనవరి 6: మెట్‌పల్లిలో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని శనివారం పట్టుకున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మెట్‌పల్లి అనుబంధ గ్రామమైన వెంకట్రావుపేట గ్రామ శివారులో మల్లన్న టెంపుల్ వద్ద ఎస్ఐ చిరంజీవి వాహనాల తనిఖీ చేపట్టగా ద్విచక్రవాహనాలపై అనుమానాస్పదంగా కనిపించిన యువకులను తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 550 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారించగా నిర్మల్ జిల్లా నుంచి మెట్‌పల్లికి టీఎస్ 21ఎల్1369 నెంబరు గల ద్విచక్రవాహనంపై గంజాయిని తీసుకొస్తున్నట్లు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని గంజాయి, ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. తహసీల్దార్ శేఖర్, వీఆర్ఏ సమక్షంలో పంచనామా చేసి ఇరువురుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయి పట్టుకున్న ఎస్ఐ చిరంజీవి, ఎఎస్ఐ ప్రకాశ్, సిబ్బంది జలెందర్, సునీల్, మల్లేశ్‌లను సీఐ అభినందించారు.

సౌదీ అరేబియాలో దమ్మన్నపేట వాసి మృతి



రాజన్న (ఫైల్)

ధర్మపురి, జనవరి 6: మండలంలోని దమ్మన్నపేట గ్రామానికి చెందిన పులిశెట్టి రాజన్న (50) అనే వ్యక్తి సౌదీ అరేబియాలో అనారోగ్యంతో మృతి చెందాడు. జీవనోపాధి నిమిత్తం రాజన్న 11 ఏళ్ల క్రితం సౌదీ అరేబియా దేశానికి వెళ్లాడు. రెండేళ్లకు ఒకసారి ఇంటికి వచ్చి తిరిగి వెళుతున్నాడు. ఏడాది క్రితం కూడా ఇంటికి వచ్చి తిరిగి అక్కడికి వెళ్లాడు. రాజన్న పనిచేస్తుండగా రెండు నెలల క్రితం వాతం వచ్చినట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. ఆరోగ్య పరిస్థితి క్షీణించడం వల్ల అక్కడే ఆసుపత్రికి తీసుక వెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజన్న పరిస్థితి విషమించి ఈ నెల 4న మృతి చెందాడు. మృతుడు రాజన్నకు రావాల్సిన 11 ఏళ్ల ఇన్సూరెన్స్ లీగల్ డబ్బులు ఇప్పించాలని, మృతదేహాన్ని దమ్మన్నపేట స్వగ్రామానికి పంపించాలని టీపీసీసీ ఎన్‌ఆర్ఐ సెల్ కన్వీనర్ షేక్ చాంద్‌పాషా కోరుతున్నారు.

రాజన్నను దర్శించుకున్న ప్రభుత్వ విప్



లక్ష్మణ్‌కుమార్‌కు రాజన్న ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

వేములవాడ టౌన్, జనవరి 6: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారిని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యేకు ఆలయాధికారుల స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం శ్రీనాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు ఆశీర్వచనంగా గావించగా సూపరింటెండెంట్ అల్లి శంకర్ రాజన్న కండువా కప్పి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు.

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య

జగిత్యాల టౌన్, జనవరి 6 :అనారోగ్య కారణంతో ఓ వివహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలోని హనుమాన్ వాడలో శనివారం చోటు చేసుకుంది. పట్టణంలోని తులసీ నగర్‌కు చెందిన బోగ సౌమ్య(36) అనే మహిళ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. తీవ్ర మనోవేధనకు గురైన సౌమ్య శనివారం తన తల్లిగారి ఇంటి వద్దకు వచ్చి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ నటేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగ్గురిపై చీటింగ్ కేసు

సిరిసిల్ల క్రైం, జనవరి 6: గత ఎన్నికల్లో తనను మోసం చేశారని సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మిట్టపల్లి శ్రీకాంత్ అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదుచేసి ధర్యాప్తుచేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. గత ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి లగిశెట్టి శ్రీనివాస్, గుంటుక మహేశ్; ఏలూరి రవి తనకు రూ. 1లక్ష ఇస్తానని చెప్పి ప్రచారం చేసేందుకు 15రోజుల్లో తిప్పుకున్నారని, ఆ తర్వాత డబ్బులు ఇవ్వకుండా మోసంచేశారని ఫిర్యాదు చేశాడు. దీంతో ముగ్గురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఐదుగురిపై అదనపు వరకట్నం కేసు

సిరిసిల్ల క్రైం, జనవరి 6: తనను అదనపు వరకట్నం తీసుకురావాలని తన భర్త, అత్త, మామలు తరుచూ వేధించారని సిరిసిల్ల పట్టణంలోని గాజుల నవ్య అనే మహిళ ఫిర్యాదు మేరకు ఐదుగురిపై అదనపు వరకట్నం కింద శనివారం కేసు నమోదు చేసి ధర్యాప్తుచేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. తన భర్త గాజుల మల్లేశం, అత్త, మామ, ఆడబిడ్డలు వివాహమైనప్పటి నుంచి తనను వేధించి అదనంగా రెండు లక్షల రూపాయలు కట్నం తీసుకురావాలని చిత్రహింసలకు గురిచేశారని బాధితురాలు నవ్య ఫిర్యాదు మేరకు అయిదుగురిపై కేసు నమోదుచేశామని ఆయన తెలిపారు.

చంపుతామని బెదిరించిన ఇద్దరిపై..

సిరిసిల్ల క్రైం, జనవరి 6: సిరిసిల్ల పట్టణంలోని సంజీవయ్యనగర్‌కు చెందిన రాకం బానుచందర్, రాకం మనోహార్ తనకు ఇచ్చే ఎనిమిది లక్షల రూపాయలు తిరిగి ఇవ్వమని అడిగినందుకు చంపుతామని బెదిరించారని బాధితుడు రాగుల రాములు ఫిర్యాదుపై శనివారం ఇద్దరిపై కేసు నమోదుచేసి ధర్యాప్తుచేస్తున్నామని టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

సుల్తానాబాద్, జనవరి 6: ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య యత్నంకు పాల్పడ్డాడు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని కుటుంబ సభ్యులు తెలిపారు. సుల్తానాబాద్ పట్టణంలోని గడీమహల్ కు చెందిన రహీల్ అనే యువకుడు ఒక సెల్ షాప్‌ను నిర్వహిస్తున్నాడు. ఏడాది క్రితమే వివాహం జరిగింది. బార్య ప్రస్తుతం గర్భవతి. షాపు నిర్వహణలో పలువరి వద్ద అప్పులు చేశాడని దానికి తోడు మైక్రో ఫైనాన్స్ సంస్థల వద్ద రుణాలు తీసుకున్నాడని అప్పుల వాళ్ల వేదింపులు, మరో వైపు మైక్రో సంస్థల ప్రతినిదులు వేదింపులు భరించలేక శుక్రవారం రాత్రి ఎవరికీ చెప్పకుండా నీరుకుళ్ల మానేరు బ్రిడ్జి వద్దకు వెళ్లి గడ్డిమందు సేవించాడు. అతని అచూకీ గంట తర్వాత కనుగొన్న కటుంబ సభ్యులు ఉటాహుటిన అస్పత్రికి తరలించారు. అనంతరం కరీంనగర్ అటు నుంచి హైదరాబాద్ తరలించారు. ప్రస్తుతం బాదితులు అస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పిచ్చికుక్కదాడిలో ముగ్గురికి గాయాలు

కాల్వశ్రీరాంపూర్, జనవరి 6: మండలంలోని మొట్లపల్లి గ్రామంలో శనివారం పిచ్చి కుక్క కరిసి ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామంలోని దారి వెంట వెళుతున్న పోగుల కౌశిక్, దుర్గం రాఘవ, బోలమల్ల శివలపై పిచ్చికుక్క వెంటపడి దాడి చేసింది. దీంతో వారిని కాల్వ శ్రీరాంపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మండలంలోని పలు గ్రామాల్లో పిచ్చి కుక్కలు ఎక్కువయ్యాయని, కొన్ని వీధి కుక్కలు రోగాల భారిన పడి సంచరిస్తున్నాయని, ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి పిచ్చి కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

వరద కాలువకు నీటి విడుదల



రాంపూర్ పంప్‌హౌజ్ వద్ద ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, తదితరులు

మల్యాల, జనవరి 6: వరదకాలువ కింద సాగు చేస్తున్న రైతులను ఆదుకోవడానికి ఎస్సారెస్పీ నుంచి రెండువేల క్యూసెక్కుల నీటిని కాలువకు విడుదల చేయగా రాంపూర్ పంప్‌హౌజ్ వద్ద చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దిగువకు విడుదల చేశారు. యాసంగి సాగు చేసిన రైతులు కాలువలో నీరులేక ఆందోళన చెందుతుండగా రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే ఇరిగేషన్ సీఈతో మాట్లాడి ఎస్సారెస్పీ నుంచి వరదకాలువకు నీటిని విడుదల చేయాలని కోరారు. దీంతో శనివారం నీరు విడుదల అయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులను ఆదుకునే బాధ్యత తమదేనని ప్రతిపక్ష నేతలు మొసలి కన్నీరు కారవడం విడ్డూరంగా ఉందని అన్నారు. యాసంగిలో గుంట పంట ఎండిపోకుండా చూస్తామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళనలు చెయకుండానే ముందస్తుగానే తామే నీటి విడుదల చేశామని అన్నారు. ఎమ్మెల్యే వెంట ఇరిగేషన్ డీఈ తిరుపతి, కాంగ్రెస్ నాయకులు దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ముత్యం శంకర్, సతీష్‌రెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వీరబత్తిని ప్రసాద్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

“ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు.. రియల్ పార్ట్‌నర్ స్వర్ణసీమ సుకేతన" స్థానిక పార్ట్‌నర్ మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల, పెద్దపల్లి పోటీల్లో కన్సోలేషన్ బహుమతి అందుకుంటున్న మహిళలు, విద్యార్థినులు..





గ్రామాల్లో పటిష్టంగా పారిశుధ్య నిర్వహణ

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఎలిగేడు, జనవరి 6 : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా చేపట్టాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శనివారం మండలంలోని లాలపల్లిలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ అరుణశ్రీ పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని, సెగ్రిగేషన్ షెడ్, కంపోస్ట్ పిట్లను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతిరోజు గ్రామంలో మల్టీలెవల్ వర్కర్లను వినియోగించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని, గ్రామంలోని పరిశుభ్రత పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ఎంపీడీవో, ఎంపీవోలు పర్యవేక్షణ చేయాలని ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పారిశుధ్య పనులు పరిశీలించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలెక్టర్ మాట్లాడి గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనుల నిర్వహణ, ఇంటిముందు ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్ గ్రామంలో పండిస్తున్న పంట వివరాలను, గ్రామంలో ఏమైన సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి శిరీష, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఏపీవో అనిల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్ చలాన్ల రాయితీని వినియోగించుకోండి

కోల్‌సిటీ, జనవరి 6: రామగుండం పారిశ్రామిక ప్రాంతంలోని వాహనదారులు పెండింగ్ చలాన్ల రాయితీని ఉపయోగించుకోవాలని రామగుండం ట్రాఫిక్ సీఐ టీ ప్రవీణ్‌కుమార్ కోరారు. ఈనెల 10వరకు అవకాశం ఉన్నందున ద్విచక్ర వాహనాలు, ఆటోలపై 80శాతం రాయితీ, నాలుగు చక్రాలు, అంతకన్నా పెద్ద వాహనాలపై 60శాతం, ఆర్‌టీసీ వాహనాలపై 90శాతం రాయితీ ఇచ్చారని, ఫోన్‌పే కానీ, పేటీఎం, గూగుల్‌పే, టీఎస్ ఆన్‌లైన్ సేవ ద్వారా చెల్లించవచ్చని, వాహనదారులు నిర్లక్ష్యం చేయకుండా చెల్లించాలని, జనవరి 11నుంచి పూర్తిస్థాయిలో ఫైన్ వసూలు చేస్తామని పేర్కొన్నారు.

టీచర్స్ కాలనీ సమస్యలు పరిష్కరించండి

కళ్యాణ్‌నగర్, జనవరి 6: రామగుండం కార్పొరేషన్ 25వ డివిజన్ పరిధిలోని టీచర్స్‌లో పలు సమస్యలు నెలకొన్నాయని, వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపాలంటూ శుక్రవారం రెసిడెన్స్ ఆఫ్ టీచర్స్ కాలనీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు వినతిపత్రం అందజేశారు. కేసీఆర్ కాలనీ, పద్మావతినగర్, చంద్రబాబుకాలనీలో డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో ఆ నీరంతా తమ కాలనీవైపు వస్తున్నాయని, రాజీవ్ రహదారి వద్ద డ్రైనేజీ మూసివేయడంతో వర్షపునీరు ఇళ్లలో చేరుతున్నాయన్నారు. తమ కాలనీలో భూగర్భ డ్రైనేజీ నిర్మించాలని ఎమ్మెల్యేకు విన్నవించుకున్నారు.

ముగిసిన ప్రజా పాలన సభలు

పెద్దపల్లి రూరల్, జనవరి 6 : పారదర్శకంగా అభయహస్తం పథకం అమలుచేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు తెలిపారు. పెద్దపల్లి మండలం నిట్టూరు, నిమ్మనపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభల్లో ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ, ప్రభుత్వ పథకాల అమలులో అవినీతికి తావులేకుండా అర్హులైన వారికి అందిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్, పెద్దపల్లి జడ్పీటీసీ రాంమ్మూర్తి, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్, ఎంపీటీసీ దొంత రాజయ్య, నిమ్మనపల్లి సర్పంచ్ పెర్క రిషిత-రాజేందర్, నిట్టూరు ఉపసర్పంచ్ గిరినేని సంపత్ రావు, ఎనగందుల నారాయణ తదితులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జనవరి 6: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా పాలన కార్యక్రమాలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించిందని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సుగ్లాంపల్లి ఒకటవ వార్డులో శనివారం గ్రామ సభ నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ పసెడ్ల మమత సంపత్‌లు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి భాస్కరాచారి, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, నాయకులు మినుపాల ప్రకాష్‌రావు, సంతోష్‌రావు, బిరుదు క్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి, జనవరి 6: మండలంలోని నవాబ్‌పేట్‌లో ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచ్ గాజుల ప్రశాంత అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎంపీపీ ఆరెల్లి దేవక్క ముఖ్యఅతిథిగా హాజరై 309 మంది నుంచి దరఖాస్తులు అందజేశారు. మండల స్పెషల్ అధికారి సాయినాథ్, ఎంపీడీవో రమేశ్, వివిధ విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ధర్మారం, జనవరి 6: మండలంలో శనివారం ప్రజాపాలన కార్యక్రమం ముగిసింది. మొత్తం 17875 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయశీల, తహసీల్దార్ రజిత, ఎంపీవో రమేష్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్

అయోధ్య శ్రీరాముడి అక్షింతల ఊరేగింపు

సుల్తానాబాద్, జనవరి 6: అయోధ్య రాముల వారి అక్షింతలకు స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జిల్లా రైస్‌ఇండస్ట్రీస్ అసోసియేషన్ అధ్యక్షుడు నగునూరి అశోక్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ పట్టణంలో శోభాయాత్ర నిర్వహించారు. మహిళల కోలాటాలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపుగా వెళ్లి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాంరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మాడూరి ప్రసాద్, చకిలం మారుతి, ఐతు రమేష్, భాస్కర్, పల్లా అపర్ణ, సురేష్, పల్లా కిషన్, రాజన్న, శివనాత్రి ప్రసాద్, వెంకన్న పాల్గొన్నారు.

మంథని, జనవరి 6: స్థానిక శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయం నుంచి మంథని రజక సేవా సంఘం ఆధ్వర్యంలో భక్తులు అయోధ్య శ్రీసీతారాముల అక్షింతలను శనివారం శోభాయాత్రతో తరలి తీసుకువెళ్లారు. అయోధ్య రామతీర్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా స్వామివారి అక్షింతలను రజకవాడలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు కొత్త శ్రీనివాస్, గర్రెపల్లి వెంకన్న, కనుకుంట్ల స్వామి సుదర్శన్, సతీష్, నరేందర్ రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ధర్మారం, జనవరి 6: అయోధ్య శ్రీరాముడి పూజిత అంక్షితలను శనివారం మండలంలోని గోపాల్‌రావుపేటలో అయోధ్య శ్రీరాముడి అక్షింతలను ఇంటింటా పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన చింతల జగన్‌మోహన్‌రెడ్డి, బద్దం లింగారెడ్డిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జనగామ అంజయ్య, ఉపసర్పంచ్ సంకసాని సతీష్‌రెడ్డి, లింగాల అనందరావు, ధనకంటి స్వామి, సందినేని లక్ష్మణ్, కొమురయ్య, చింతల నాగిరెడ్డి, తిరుపతిరెడ్డి, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



లేడీస్ క్లబ్‌లో ఆధ్వర్యంలో బొమ్మల కొలువు



బొమ్మల కొలువును పరిశీలిస్తున్న ముఖ్యఅతిథులు

రామగిరి, జనవరి 6: సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్‌లలో లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సీఎస్‌సీపీఏ క్లబ్‌లో బొమ్మల కొలువును వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లేడీస్‌క్లబ్ అధ్యక్షురాలు అలివేణి సుధాకర్‌రావు, జీఎం ఏపీఏ విజయలక్ష్మి వెంకటేశ్వర్లు అధ్యక్షతన ముఖ్యఅతిథులుగా డైరెక్టర్ (ఆపరేషన్స్) సతీమణి కళ్యాణి శ్రీనివాస్, డైరెక్టర్(ప్రాజెక్టుఅండ్‌ప్లానింగ్) హాజరై బొమ్మల కొలువును ప్రారంభించారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయం ఉట్టిపడేలా సంక్రాంతి లక్ష్మి, వివిధ ప్రతిమలను, బొమ్మలను ఏర్పాటు చేశారు. అనంతరం బొమ్మల కొలువును ఆర్జీ-3,ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు సందర్శించారు. ఈ కార్యక్రమంలో లేడీస్ క్లబ్ మహిళ నాయకులు గీతారాణి, హరిణి, లావణ్య, నిఖిత, కోమలి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్, జనవరి 6: కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ ఉపప్రధాన కార్యదర్శి కె వీరభద్రయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా అన్నారు. ఆర్‌కె 5 గనిని శనివారం సందర్శించి కార్మికులతో మాట్లాడారు. ప్రసాద్‌రెడ్డి, నర్సింగరావు, విశ్వనాథ్‌రెడ్డి తదితరులున్నారు.

కొత్త గనులు, బ్లాకులపై దృష్టి

- సమీక్షలో సీఎండీ బలరాం

గోదావరిఖని, జనవరి 6: రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి సీఎండీ మార్పు ప్రభావం సంస్థపై కనబడుతున్నది. సీఎండీ బలరాం సింగరేణి కార్యకలాపాలపై దృష్టిసారించారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన వారంరోజుల్లోనే అనేక సమీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా సింగరేణి సంస్థలో కొత్త గనులపై శనివారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. 2024లో సింగరేణిలో నాలుగు కొత్త గనులను ప్రారంభించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నూతన బొగ్గు బ్లాకులు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతున్నట్టు బలరాం ఈ సందర్భంగా పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఉన్నత స్థాయి సమావేశంలో బలరాం పలు అంశాలపై లోతుగా చర్చించారు. నూతన బొగ్గు గనులపై తగిన కార్యాచరణతో ముందుకెళ్లాలని, నిర్దేశించిన గడువులోపు పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నీ ఏరియాల జీఎంలను ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించాల్సిన నాలుగు కొత్త గనుల ప్రణాళికలు, పనులపై బలరాం సుదీర్ఘంగా అధికారులతో మాట్లాడారు. ఒడిస్సాలో సింగరేణిలో చేపట్టిన నైని బొగ్గు బ్లాకు ప్రస్తుత పరిస్థితిపై చర్చించిన సీఎండీ చివరి దశ అనుమతుల కోసం ఒడిస్సా ప్రభుత్వ సహకారాన్ని కోరాల్సి ఉందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక చొరవ తీసుకునే అవకాశం ఉందని ఆయన చెప్పారు. ఈనెల 3వ వారంలో ఒడిస్సా ముఖ్యమంత్రితో మాట్లాడేందుకు భట్టి విక్రమార్క భువనేశ్వర్‌కు వెళతారని, ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈపరిణామంతో నైని బ్లాకు అనుమతులు పూర్తయి త్వరలో అక్కడ బొగ్గు ఉత్పత్తి ప్రారంభమవుతుందని ఆశా భావం వ్యక్తం చేశారు. నైనీ బ్లాక్ ప్రారంభిస్తే ప్రతి ఏటా కోటి టన్నుల బొగ్గు ఉత్పత్తి జరుగుతుందని, తొలి ఏడాది 60లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేసేందుకు లక్ష్యంగా ఎంచుకున్నామన్నారు. నైనీ బ్లాక్‌లో ఉత్పత్తి అయ్యే బొగ్గును సమీపంలోని రైల్వేసైడింగ్‌కు తరలించేందుకు కాంట్రాక్టు కూడా అప్పగించడం జరిగిందన్నారు. కొత్తగూడెం ఏరియాలో ప్రారంభించాల్సి ఉన్న వీకే ఓపెన్‌కాస్టు గనికి సంబంధించి అనుమతులు పూర్తి చేసుకుని ఈ ఏడాది 35లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసేందుకు సన్నద్ధం కావాలని ఆయన సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ గని నుంచి ఏడాదికి 43లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయాలన్నారు. అలాగే ఇల్లందు ఏరియాలో 20లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా ప్రారంభించనున్న రొంపెడు ఓపెన్‌కాస్టు గని నుంచి ఇదే సంవత్సరం కనీసం లక్ష టన్నుల బొగ్గు తీయాలన్నారు. బెల్లంపల్లి ఏరియా గోలేటి ఓపెన్‌కాస్టు అనుమతులపై కూడా ఈ సమీక్షలో చర్చించారు. ఏడాదికి 30లక్షల టన్నుల బొగ్గు గోలేటి ఓసీపీ నుంచి తీయాలని, ఈ గని నుంచి ఈ సంవత్సరం కనీసం 4లక్షల టన్నులు ఉత్పత్తి చేయాలన్నారు. అనుమతుల విషయంలో కాలయాపన జరిగితే రేట్లు పెరిగి ఉత్పత్తి వ్యయం భారం అవుతుందని, ఏరియా జీఎంలు, స్థానిక కలెక్టర్లు, సంబంధిత అధికారులతో సంప్రదింపులు జరిపి అనుమతులు త్వరగా పొందేలా ప్రయత్నించాలని సీఎండీ సూచించారు. వచ్చే ఏడాది ప్రారంభించాల్సి ఉన్న రామగుండం ఓపెన్ కాస్టు, ఎంవీకే ఓపెన్‌కాస్టు గనుల గురించి కూడా ఈ సందర్భంగా సీఎండీ చర్చించారు. ఇంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా మరికొన్ని బొగ్గు బ్లాకులను పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి విక్రమార్క ఇటీవల సింగరేణిపై నిర్వహించిన సమీక్షలో కొత్తగనుల ప్రారంభానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారని తెలిపారు. ఈ సమావేశంలో సంస్థ డైరెక్టర్లు డీ సత్యనారాయణరావు, ఎన్‌వీకే శ్రీనివాస్, జీ వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం కో ఆర్డినేషన్ జే అల్విన్, సీపీపీ జీఎం సురేష్, జీఎంలు జక్కం రమేష్, మల్యాల సుబ్బారావు, సురేష్, జీ దేవేందర్, సూర్యనారాయణతో పాటు కార్పొరేట్ జీఎంలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ బలరాం

కార్మిక వాడల అభివృద్ధిపై దృష్టి పెట్టండి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, జనవరి 6: సింగరేణి కార్మిక వాడల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టి మౌలిక వసతులు కల్పించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌రాజ్‌ఠాకూర్ సింగరేణి అధికారులకు సూచించారు. శనివారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సింగరేణికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం లభిస్తుందని, ఓసీపీల కింద భూములు కోల్పోయిన రైతులకు చాలామందికి ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ రాలేదని, వారికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇప్పించాలని, వారికి వేరేచోట భూములు కేటాయించాలని కోరారు. పర్యావరణంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఇక్కడ రామగుండంలో వాయు, నీరు కాలుష్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఓసీపీ-5 డంపులపైన మొక్కలను పెంచి దుమ్ము లేవకుండా చర్యలు చేపట్టాలని, బ్లాస్టింగ్‌లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బ్లాస్టింగ్‌ల తీవ్రతను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. పలు కాలనీల్లో ఇప్పటికీ మురికి నీరు వస్తుందని, కార్మిక కుటుంబాలకు శుద్ధి చేసిన మంచి నీటిని అందించేందుకు ర్యాపిడ్ గ్రావిటీ సిస్టంను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్మికుల వద్ద ఎవరైనా క్వార్టర్లు, ఇతర పనుల పేరిట డబ్బులు వసూలు చేస్తే సహించేది లేదని, సింగరేణి సొమ్మును కార్మికుల సంక్షేమం కోసమే వినియోగించాలని కోరారు. సింగరేణి స్టేడియం అధ్వానంగా మారిందని, దానిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, జిమ్‌ను కూడా ఆధునికీకరించాలని సూచించారు. ఎస్‌టీపీలను ఏర్పాటు చేసి గోదావరిలో మురికి నీరు కలువకుండా చర్యలు చేపట్టాలని, కార్మిక వాడల్లో డ్రైనేజీ, విద్యుత్ దీపాలు సక్రమంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. మళ్లీ త్వరలో సమావేశం ఏర్పాటు చేసుకుని కార్మికుల సమస్యలపై చర్చిద్దామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఏజెంట్ బానోతు సైదులు, ఏరియా ఇంజనీర్ రాంమూర్తి, డీజీఎం(పర్సనల్) లక్ష్మీనారాయణ, పొనగోటి శ్రీనివాస్, ప్రభాకర్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

నూతన డంపర్లను ప్రారంభించిన ఆర్జీ-3 జీఎం



ఓసీపీ-1లో నూతన డంపర్లను ప్రారంభిస్తున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 6: ఓసీపీ-1లో నూతనంగా కొనుగోలు చేసిన ఐదు డంపర్లను శనివారం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు ప్రారంభించారు. బేస్‌వర్క్‌షాప్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో డంపర్లకు పూజలు చేసిన అనంతరం జండా ఊపి ప్రారంభించారు. ప్రాజెక్టు అవసరాలను దృష్టిలో ఉంచుకుని 60 టన్నుల సామర్థ్యం గల ఐదు డంపర్లు, ఒక డీజిల్ బోజర్‌ను కొనుగోలు చేసినట్టు జీఎం తెలిపారు. బీఈఎంఎల్ కంపెనీకి చెందిన ఒక్కో డంపర్ విలువ 2.80కోట్లు కాగా, డీజిల్ బోజర్‌కు 40లక్షలు వెచ్చించినట్టు తెలిపారు. యంత్రాలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ఉత్పత్తి లక్ష్యాలను సాధించేలా ఉద్యోగులు కృషి చేయాలని సూచించారు. యంత్రాల మెయింటనెన్స్ సక్రమంగా చేస్తే వాటి జీవిత కాలం పెరగడంతో పాటు ఆశించిన పనితీరు కనబరుస్తాయని జీఎం సుధాకర్‌రావు అన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ ఎలీషా, ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, పీఈ ఆర్ శ్రీనివాస్, పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, బేస్‌వర్క్‌షాప్ ఇంచార్జి సత్యనారాయణ, ఇన్‌చార్జి మేనేజర్ కోటయ్య, బీఈఎంఎల్ డీజీఎం సతీష్ ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న జీఎం శ్రీనివాస్

కోల్‌సిటీటౌన్, జనవరి 6: విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకోవాలని సింగరేణి ఆర్‌జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. శనివారం గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆపిల్ కిడ్స్ స్కూల్ స్పోర్ట్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జీఎంకు పాఠశాల విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ క్రీడలు, సాంస్కృతిక ప్రదర్శనలు విద్యార్థులు ఐక్యమత్యాన్ని, క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులు ఏకాగ్రతతో విద్యను అభ్యసించి మంచిస్థాయి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల కరస్పాండెంట్ గాలి సునీత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి మణాలిఠాకూర్, కార్పొరేటర్ పెద్దెల్లి తేజస్విప్రకాష్, స్వచ్ఛంద సంఘాల బాధ్యులు దయానంద్‌గాంధీ మగువ కోశాధికారి శశికళ, స్కూల్ డైరెక్టర్ గిరిధర్ మురారీ, స్కూల్ ఇన్‌చార్జీలు అనిత, అరుణ, సుస్మిత పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి లయన్స్‌క్లబ్ చేయూత

పెద్దపల్లి రూరల్, జనవరి6: పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామానికి చెందిన ఈదునూరి దుర్గయ్య ఇంటిలో కిరాయి ఉంటున్న ఆశ కార్యకర్త అరుణ-శ్రీనివాస్‌ల గది ప్రమాదవశాత్తు దగ్ధం కాగా లయన్స్ క్లబ్ సభ్యులు చేయూతనందించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ పెద్దపల్లి ఆధ్వర్యంలో వారి కుటుంబానికి 11వేల రూపాయల నగదు, 50 కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు సాదుల వెంకటేశ్వర్లు, వైస్ ఎంపీపీ ముత్యాల రాజయ్య, గంట్ల రాంచంద్రారెడ్డి, బెల్లంకొండ జైపాల్‌రెడ్డి, తాళ్ల నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడిగా తిరుపతమ్మఅంకూస్



కోల్‌సిటీ, జనవరి 6: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మామిడి తిరుపతమ్మఅంకూస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు రేషన్ డీలర్లు పేర్కొన్నారు. డీలర్ల సమస్యలపై చర్చించి ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారన్నారు. పెద్దపల్లి గోడౌన్ నుంచి బియ్యం సరఫరా అయ్యే సమయంలోనే తూకం వేయించుట, గోడౌన్ నుంచి పెద్దపల్లి నుంచి రామగుండంకు మార్చడం తదితర సమస్యలపై చర్చించినట్టు వారు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ ఎంపీ టిక్కెట్ కోసం శంకర్‌లాల్ దరఖాస్తు

మంథని, జనవరి 6: వచ్చే ఎన్నికల్లో పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయటానికి అవకాశం కల్పించాలని మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావును కోరుతూ శనివారం వినతిపత్రాన్ని అందజేసినట్లు బీఆర్ఎస్ సీనియర్ నేత, మంథని జడ్పీటీసీ భర్త తగరం శంకర్‌లాల్ తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో జరిగిన పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమీక్షా సమావేశంలో సభా అధ్యక్షుడిగా వ్యవహరించిన హరీష్‌రావుకు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

ధర్మారం, జనవరి6: ధర్మారం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారి ఎలగందుల రాజేశం ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని శనివారం చెన్నూర్ ఎమ్మెల్యే జి.వివేక్‌వెంకటస్వామి పరామర్శించారు.ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

ఓదెల, జనవరి 6: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై మండలంలోని మడకలో శనివారం అవగాహన కల్పించారు. వికాసత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రచార రథం ద్వారా ఎల్‌ఈడీ స్క్రీన్ పై ప్రధాని అమలుచేస్తున్న పథకాలను ప్రజలకు చూపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర దళిత మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి వివరిస్తూ రాష్ట్రంలో స్వచ్ఛ భారత్ పథకం ద్వారా వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. రైతులకు కిసాన్ సమ్మాన్ నిధి , తపాల శాఖ ద్వారా పదేళ్ల పిల్లలకు నెలకు రూ.1000 , ఉజ్వల గ్యాస్ ద్వారా సబ్సిడీ అందజేస్తున్నామన్నారు. ఈజీఎస్ లబ్ధిదారులకు ఈనెల నుండి వారి ఖాతాలో కూలీ డబ్బులు జమ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి సురేందర్‌తో పాటు బిజేపి నాయకులు సతీష్, నరసింహచారి, వెంకటరెడ్డి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దు



మాట్లాడుతున్న ఏసీపీ తులా శ్రీనివాసరావు

కోల్‌సిటీ, జనవరి 6: యువత గంజాయికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఏసీపీ తులా శ్రీనివాసరావు పేర్కొన్నారు. గంజాయి సేవించడానికి అలవాటు పడిన పలువురు యువకులు, కార్మికులను గుర్తించి శనివారం గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించిన క్రమంలో విచక్షణ కోల్పోయి నేరాలు ప్రవృత్తి పెరుగుతుందన్నారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలు అమ్మినా పీడీయాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో సీఐలు ప్రమోద్‌రావు, ప్రసాద్‌రావు, ఎస్ఐ సుగుణాకర్ పాల్గొన్నారు.

క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించిన ఎమ్మెల్యే

పెద్దపల్లి రూరల్, జనవరి 6 : పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల డిగ్రీ కళాశాల ఎదురుగా ఆగి ఉన్న లారీ సుల్తానాబాద్‌కు చెందిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొని గాయాల పాలు కాగా అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు క్షతగాత్రుడిని అంబులెన్స్ ద్వారా స్థానికుల సహాయంతో పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఎమ్మెల్యే విజయరమణారావు ఫోన్‌లో ఆదేశించారు.

కోరం లేక మండల సర్వసభ్య సమావేశం వాయిదా

పెద్దపల్లి రూరల్, జనవరి 6: పెద్దపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో రాజు ప్రకటించారు. మండలంలో 17 మంది ఎంపీటీసీలు ఉండగా కేవలం ముగ్గురు మాత్రమే సమావేశానికి హాజరు కావడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

ఉర్దూ మీడియం పాఠశాలల్లో పోస్టులను భర్తీ చేయాలి

కళ్యాణ్‌నగర్, జనవరి 6: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉర్దూ మీడియం పాఠశాలల్లో పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలని జమాతే ఈ ఇస్లామిక్ హింద్ అధ్యక్షుడు ముబాషిర్ ఉజాఫర్ అన్నారు. శనివారం గోదావరిఖని అశోక్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

మైనార్టీ రెసిడెన్షియల్, జూనియర్ కళాశాలల్లో చాలా వరకు ఉపాధ్యాయులు, అధ్యాపకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వెంటనే వాటిని వెంటనే భర్తీ చేయాలన్నారు. అనంతరం జమాతే ఇస్లామిక్ హింద్ టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అలీమొద్దీన్, బారి, ముజీమిల్, ఇర్ఫాన్, మిరాజ్ అహ్మద్, ఖాజా మహ్మద్, ఇస్మాయిల్, ఉర్దు మీడియం పాఠశాలల ప్రిన్సిపాల్లు, హెడ్‌మాస్టర్లు పాల్గొన్నారు.